సాక్షి
సిద్దిపేట
ఆదివారం, 6, ఆగస్టు, 2023



ఓ.. మై ఫ్రెండ్..

స్నేహం ఎంతో మధురమైనది. కష్టకాలంలో నేనున్నానంటూ భుజం తట్టే ఆత్మీయ స్పర్శ స్నేహం. ప్రపంచ స్నేహితుల దినోత్సవం సందర్భంగా సాక్షి ప్రత్యేక కథనం. 10లో..



విలీన బిల్లు జాప్యంపై భగ్గు

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడంపై శనివారం డిపోల ఎదుట సిబ్బంది ఆందోళన చేశారు 11లో..

దరఖాస్తుల ఆహ్వానం


ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): తెలంగాణ రాష్ట్ర మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో మైనారిటీ విద్యార్థులకు గ్రూప్–3 పరీక్ష కోసం ఉచిత శిక్షణ అందించనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రాంగోపాల్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తివివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

శరవేగంగా..!

ట్రిపుల్‌ఆర్ భూసేకరణ కార్యాచరణ

రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. పనుల ప్రారంభానికి క్షేత్రస్థాయి కార్యాచరణ మొదలైంది. వచ్చే ఏడాది మార్చిలోగా భూసేకరణ పూర్తి చేసి పనులు ప్రారంభించాలనే లక్ష్యంతో నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ముందుకు సాగుతోంది.

- మార్చి 2024లోగా పూర్తి చేయాలని లక్ష్యం
- ఇప్పటికే చౌటుప్పల్, యాదాద్రి, ఆందోల్ జోగిపేట్ కాలాలకు త్రీడీ నోటిఫికేషన్
- త్వరలో గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్‌లతోపాటు భువనగిరికి కూడా
- నష్ట పరిహారం పంపిణీ తర్వాతే పనులు ప్రారంభం



రీజినల్ రింగు రోడ్డు ఉత్తర భాగం మ్యాపు

గజ్వేల్: ట్రిపుల్‌ఆర్(రీజినల్ రింగు రోడ్డు) ఉత్తర భాగం నిర్మాణ పనులు వేగం పుంజుకోనున్నాయి. భూసేకరణను మార్చి 2024 వరకు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని ఎన్‌హెచ్‌ఏఐ(నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. భూసేకరణలో కీలకమైన త్రీడీ నోటిఫికేషన్ ఇప్పటికే చౌటుప్పల్, యాదాద్రి, ఆందోల్–జోగిపేట కాలా (కాంపిటెంట్ అథారిటీ ఫర్ ల్యాండ్ అక్విజిషన్)లకు విడుదల కాగా, త్వరలోనే ఉమ్మడి మెదక్ జిల్లాలో మిగిలిపోయిన గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్‌తోపాటు యాదాద్రి జిల్లా భువనగిరికి విడుదల కానుంది.

ట్రిపుల్‌ఆర్ పనుల్లో మరో ముందడుగు పడింది. ఆరునెలల్లో ఉత్తర భాగంలోని ఉమ్మడి నల్లగొండ జిల్లాతోపాటు ఉమ్మడి మెదక్ జిల్లా పరిధిలోని (సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి) ట్రిపుల్‌ఆర్ పనుల ప్రారంభానికి సంబంధించి క్షేత్రస్థాయి కార్యాచరణ మొదలైంది. ప్రస్తుతం ఉత్తర భాగం రీజినల్ రింగు రోడ్డు నిడివి 158 కిలోమీటర్లు కాగా, ఇందులో 100కిలోమీటర్ల వరకు ఉమ్మడి మెదక్ జిల్లాలో విస్తరించనుంది. భూసేకరణ సులభతరం చేయడానికి రెవెన్యూ డివిజన్ల వారీగా 'కాలా'ను ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగానే చౌటుప్పల్ కాలా పరిధిలో 25కిలోమీటర్ల మేర ట్రిపుల్‌ఆర్ నిర్మాణం జరగనుండగా, ఇక్కడ 10గ్రామాల్లో భూసేకరణ జరగనుంది. యాదాద్రి పరిధిలో 19కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణానికి ఏడు గ్రామాల్లో, ఆందోల్–జోగిపేట పరిధిలో 8.5కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం ఐదు గ్రామాల్లో భూసేకరణ జరగనుంది. ఈ మూడు కాలాల పరిధిలో ఇప్పటికే నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో త్వరలోనే భూసేకరణ ప్రక్రియ వేగవంతం కానుంది.

మరో ఐదు 'కాలా'లకు త్వరలోనే త్రీడీ నోటిఫికేషన్లు

గజ్వేల్ కాలా పరిధిలో 32 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం జరగనుండగా, ఇక్కడ 17గ్రామాల్లో, తూప్రాన్ పరిధిలో 14కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి 8 గ్రామాల్లో, నర్సాపూర్‌లో 28కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం కోసం 14 గ్రామాల్లో భూసేకరణ జరగనుంది. ఇకపోతే భువనగిరి కాలా పరిధిలో 15కిలోమీటర్ల రోడ్డు నిర్మాణం జరగనుండగా, ఆరు గ్రామాల్లో భూమిని సేకరించనున్నారు. మొత్తంగా ఎనిమిది 'కాలా'ల పరిధిలోని 84 గ్రామాల్లో 4700 ఎకరాల వరకు భూసేకరణ జరగనుంది. అత్యధికంగా గజ్వేల్‌లో 980 ఎకరాలను సేకరించనున్నారు. ఆయా కాలాలకు సంబంధించిన త్రీడీ నోటిఫికేషన్లు ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ వద్ద ఆమోదానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ నోటిఫికేషన్ వస్తే పరిహారం లెక్కలపై స్పష్టత రానుంది. అంతేకాకుండా ఈ నోటిఫికేషన్‌లో సర్వే నెంబరు, రైతు పేరు, భూసేకరణ జరగనున్న విస్తీర్ణం తదితర అంశాలు సైతం అధికారికంగా సమగ్రంగా తెలియనున్నాయి. పరిహారం పంపిణీకి 2013 చట్ట ప్రకారం ముందుకెళ్తారా..? ఇతర మార్గాలను అనుసరిస్తారా..? అనేది తేలాల్సి ఉంది. ఈ విషయంపై స్పష్టత వస్తే పరిహారం లెక్కలు తేలనుంది. ఆ తర్వాతనే పనుల ప్రారంభానికి మార్గం సుగమం అవుతుంది. మొత్తానికి ఈ ప్రక్రియను మార్చి 2024లోగా పూర్తి చేసి పనులు ప్రారంభించాలనే సంకల్పంతో ఎన్‌హెచ్‌ఏఐ ముందుకు సాగుతోంది.

> **త్వరలోనే పెండింగ్ త్రీడీ నోటిఫికేషన్లు**
>
> ట్రిపుల్‌ఆర్ ఉత్తర భాగంలో పెండింగ్‌లో ఉన్న గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్‌తోపాటు భువనగిరి కాలాలకు సంబంధించిన త్రీడీ నోటిఫికేషన్లు త్వరలో విడుదల కానున్నాయి. నర్సాపూర్ ఒక్కటి ఆలస్యం కావొచ్చు. నోటిఫికేషన్లు రాగానే భూసేకరణ, నష్ట పరిహారం పంపిణీ చేసి పనుల ప్రారంభానికి సంబంధించిన కార్యాచరణను వేగవంతం చేస్తాం.
>
> – రాహుల్, ఎన్‌హెచ్‌ఏఐ డిప్యూటీ మేనేజర్

న్యూస్‌రీల్

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీ కండువా కప్పుతున్న ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్‌లోని సీఎం మినీ క్యాంపు కార్యాలయంలో వర్గల్ మండలం చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ ముదిరాజు సంఘం నాయకులు, కార్యకర్తలు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ శ్రీనివాస్, బాలేష్ తదితరులు పాల్గొన్నారు.

నట్టల నివారణకు టీకాలు



టీకాలు వేస్తున్న పశుసంవర్ధక శాఖ సిబ్బంది

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): వర్షాకాలంలో పాడి పశువులకు నట్టల నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి జగత్‌కుమార్‌రెడ్డి అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 9 వరకు నట్టల నివారణ మందులు అందించనున్నట్లు తెలిపారు. 10వ తేదీ నుంచి నెల రోజులపాటు గాలికుంటు వ్యాధి, ముద్ద చర్మవ్యాధి, నీలి నాలుక వ్యాధులకు టీకాలు వేయనున్నట్లు పేర్కొన్నారు.

రెండో రోజు నాలుగు దరఖాస్తులు



దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

సిద్దిపేటకమాన్: జిల్లాలో ఉన్న మద్యం దుకాణాల లైసెన్సులు పొందడానికి రెండో రోజు శనివారం నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాసమూర్తి తెలిపారు. సిద్దిపేట సర్కిల్‌లో రెండు, గజ్వేల్ సర్కిల్‌లో రెండు అందాయని తెలిపారు. ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐ కిరణ్, ఆయా సర్కిల్ సీఐలు, ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమం



జెండాను ఎగురవేస్తున్న కార్మికులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): కార్మికుల హక్కుల సాధన కోసం భవన నిర్మాణ రంగ కార్మిక సంఘం ఉద్యమిస్తుందని జిల్లా అధ్యక్షుడు భిక్షపతి అన్నారు. సంఘం 20 ఏళ్ల వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో కార్మిక జెండాలు ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 1996 చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రవి, రాములు, మల్లేశం, కనకయ్య, యాదగిరి, సత్తయ్య, ఐలయ్య పాల్గొన్నారు.

పట్టణంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు

సిద్దిపేటకమాన్: పట్టణంలో నేడు (ఆదివారం) హాఫ్ మారథాన్ రన్ నిర్వహించనున్నందున ఉదయం 5 నుంచి 9 గంటల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు సీపీ శ్వేత శనివారం తెలిపారు. 21కే రన్ సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం నుంచి ముస్తాబాద్ చౌరస్తా, అంబేడ్కర్ చౌరస్తా, వేములవాడ కమాన్, ఎల్లమ్మ టెంపుల్, లింగారెడ్డిపల్లి, రంగనాయక సాగర్ ప్రాజెక్ట్ వరకు కొనసాగుతుందన్నారు.రంగీలా దాబా చౌరస్తా నుంచి పట్టణానికి వచ్చే వాహనదారులు రాజీవ్ రహదారి హైదరాబాద్ రోడ్డు వైపు నుంచి వెళ్లాలన్నారు. సిద్దిపేట రూరల్ పోలీసు స్టేషన్ నుంచి పట్టణానికి వచ్చేవారు ఎన్సాన్‌పల్లి బైపాస్ మీదుగా వెళ్లాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ నుంచి వచ్చేవారు పెద్దమ్మ టెంపుల్ పక్కన బైపాస్ నుంచి వెళ్లాలని సూచించారు. పోటీలు జరిగే సమయంలో రంగనాయక సాగర్ ప్రాజెక్ట్ పైకి ఎవరూ రాకూడదని సూచించారు.

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు



కిట్లను అందజేస్తున్న రోజాశర్మ

గజ్వేల్‌రూరల్: సీఎం కేసీఆర్ వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు చేస్తూ ప్రతి ఒక్కరికీ మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ పేర్కొన్నారు. శనివారం పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న మాతాశిశు ఆసుపత్రి నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ సాయికిరణ్‌తో కలిసి గర్భిణులకు న్యూట్రీషియన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, జెడ్పీటీసీ మల్లేశం, మున్సిపల్ వైస్‌చైర్మన్ జకియొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన



పనులు పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

సాక్షి ఎఫెక్ట్..

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఇష్టారాజ్యంగా సాగుతున్న యూజీడీ పనులపై 'నిబంధనలకు నీళ్లు' శీర్షికన గత నెల 22న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, కమిషనర్ విద్యాధర్ స్పందించారు. శనివారం పట్టణంలోని పలు వార్డుల్లో సాగుతున్న పనులు, ఇంటి కనెక్షన్లను పరిశీలించారు. పనులు నాణ్యతతో వేగంగా చేపట్టాలని ఆదేశించారు. నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదన్నారు. మున్సిపల్ ఇంజినీర్లు కిష్టన్న, ధనరాజ్, కౌన్సిలర్ మామిడి విద్యారాణి పాల్గొన్నారు.

ఆచార్య జయశంకర్ జయంతి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఆచార్య కొత్తపల్లి జయశంకర్ జయంతి ఉత్సవాలు ఆదివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి మురళి శనివారం తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరు కావాలని కోరారు.

సైక్లింగ్ చేస్తూ సిద్దిపేటకు

సిద్దిపేటకమాన్: ప్రతి ఒక్కరూ ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని డాక్టర్ నాగలక్ష్మీ అన్నారు. నేడు సిద్దిపేటలో నిర్వహించనున్న హాఫ్ మారథాన్ రన్‌కు మద్దతుగా ఆమె శనివారం ఉదయం హైదరాబాద్ నుంచి సైక్లింగ్ చేస్తూ సిద్దిపేటకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీపీ శ్వేతతో కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో రన్నర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బాపురెడ్డి, రాజు తదితరులు పాల్గొన్నారు.



నాగలక్ష్మీకి మొక్కను అందజేస్తున్న సీపీ శ్వేత

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు



ప్రకృతి వనాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

అదనపు కలెక్టర్ అగర్వాల్

దుబ్బాకటౌన్: దుబ్బాక అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా పోలింగ్ బూత్‌లను మార్పు చేస్తున్నట్లు అదనపు కలెక్టర్, నియోజకవర్గ ఆర్‌ఓ గరిమా అగర్వాల్ తెలిపారు. శనివారం తహసీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌ల రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా పలు మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. తొగుట మండలంలో పీఎస్ 132ను మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ నుంచి రాంపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలోకి, నార్సింగ్ మండలం పీఎస్ 214ను మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ నుంచి ఐకేపీ భవన్‌కు, పీఎస్ 18ను మండల పరిషత్ ప్రైమరీ స్కూల్ నుంచి ఉర్దూ భవనానికి మార్చుతున్నట్లు పేర్కొన్నారు.

పల్లె ప్రకృతి వనాల పరిశీలన

దుబ్బాకరూరల్: మండలంలోని హసన్‌మీరాపూర్, బల్వంతాపూర్ గ్రామాల్లోని పల్లె ప్రకృతివనం, వైకుంఠధామాలు, నర్సరీలు, డంప్‌యార్డులు, క్రీడా ప్రాంగణాలు, పంచాయతీ రికార్డులను అదనపు కలెక్టర్ పరిశీలించారు. నర్సరీల్లో మొక్కలు ఎండి పోకుండా చూడాలని, చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేయొద్దని సూచించారు.

నేరాల నియంత్రణకు చర్యలు



మాట్లాడుతున్న ఏసీపీ సతీష్

హుస్నాబాద్: నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఏసీపీ సతీష్ సూచించారు. ఏసీపీ కార్యాలయంలో నిర్వహించిన హుస్నాబాద్ సబ్ డివిజన్ నేర సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. సమావేశంలో సీఐ కిరణ్, హుస్నాబాద్ ఎస్సై మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మోదీ నిరంకుశ పాలనకు చెంపపెట్టు

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రధాని మోదీ నిరంకుశ పాలనకు సుప్రీం కోర్టు తీర్పు చెంపపెట్టని కాంగ్రెస్ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ, పీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. సుప్రీంకోర్టులో రాహుల్‌గాంధీకి స్టే లభించడంతో శనివారం చిన్నకోడూరులో టపాకాయలు కాల్చి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోదీ అవినీతి పాలనను నిలదీస్తూ ప్రజల ముందుకు పోతున్న రాహుల్ పోరాటాన్ని తట్టుకోలేక అధికార బలంతో పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేశారన్నారు. ఈ తీర్పుతో రాహుల్ ప్రధాని కావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో గణేష్, బంక చిరంజీవి, శ్రీనివాస్, సంతోష్, కనకరాజు, చంద్రశేఖర్, అజ్జు యాదవ్ పాల్గొన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ ఫిషర్‌మెన్ రాష్ట్ర కార్యదర్శిగా నియామకమైన చిన్నకోడూరుకు చెందిన జంగిటి శ్రీనివాస్‌ను పార్టీ శ్రేణులు, ముదిరాజ్ సంఘ సభ్యులు సన్మానించారు.



సమావేశంలో మాట్లాడుతున్న సూర్యవర్మ

కోర్టు తరలింపుపై రగడ

నేడు దుబ్బాక బంద్‌కు కాంగ్రెస్ పిలుపు

దుబ్బాకటౌన్: దుబ్బాక నుంచి మండలంలోని తిమ్మాపూర్‌కు కోర్టు తరలిస్తున్నారంటూ ఏడాదిన్నర క్రితం పెద్దఎత్తున దుమారం లేచింది. ఆ సమయంలో అధికార పార్టీతోపాటు కాంగ్రెస్, బీజేపీల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. తాజాగా శనివారం దుబ్బాక మున్సిఫ్ కోర్టు భవన నిర్మాణానికి జిల్లా న్యాయమూర్తి రఘురాం, దుబ్బాక జడ్జి చందనలు స్థల పరిశీలన చేయడంతో ఆ పంచాయితీ మళ్లీ తెరపైకి వచ్చింది. గతంలో నిర్ణయించిన పట్టణంలోని దుంపలపల్లి రోడ్డులో, తిమ్మాపూర్‌లో సైతం కోర్టు ఏర్పాటుకు స్థల పరిశీలన చేశారు. దీంతో తిమ్మాపూర్‌కు కోర్టు తరలిపోతుందన్న ప్రచారం జోరందుకుంది.

తిమ్మాపూర్‌కు కోర్టు తరలింపుపై గతంలో ఆందోళనలు చేశారు. అలాంటిదేమీ లేదని దుబ్బాక పట్టణంలోనే భవన నిర్మాణ జరుగుతుందని ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు మీడియా ఎదుట వెల్లడించారు. దాంతో ఆందోళన సద్దుమణిగింది. ఏడాదిన్నర తర్వాత కోర్టు భవనం తిమ్మాపూర్‌లో నిర్మిస్తున్నారనే విషయం సోషల్ మీడియాలో హల్‌చల్ చేయడంతో మళ్లీ వివాదం మొదటికొచ్చింది.

నేడు దుబ్బాక బంద్‌కు కాంగ్రెస్ పిలుపు

దుబ్బాక నుంచి తిమ్మాపూర్‌కు కోర్టు తరలింపునకు కుట్ర చేస్తున్నారని నిరసిస్తూ ఆదివారం దుబ్బాక బంద్‌కు కాంగ్రెస్ పిలుపునిచ్చింది. శనివారం రాత్రి కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. దుబ్బాక నుంచి తిమ్మాపూర్‌కు కోర్టును తరలిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. తరలింపు విషయం ప్రచారం జరుగుతున్నా ఎంపీ, ఎమ్మెల్యే రఘునందన్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు స్పందించకపోవడం దారుణమన్నారు. నేడు తలపెట్టిన పట్టణ బంద్‌కు సహకరించాలని కోరారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు అనంతుల శ్రీనివాస్, మున్సిపల్ అధ్యక్షులు యేసురెడ్డి, శ్రీరాం నరేందర్, భరత్, మల్లేశం, శ్రీనివాస్, రాజు ఉన్నారు.



దుబ్బాకలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు



హరివిల్లు.. కనువిందు

ప్రకృతి ఎంత అందమైనదో వర్ణించడానికి కవులకు ఎన్ని పదాలు ఉపయోగించినా సరిపోవు. ముఖ్యంగా నీలాకాశంలో ఆవిష్కృతమయ్యే ఇంద్రధనస్సును చూస్తే పరవశించని హృదయాలుండవు. హరివిల్లును చూసి పిల్లలు, పెద్దలు ఆనందంతో గంతులేస్తారు. అలాంటి సప్తవర్ణాల దృశ్యం రామగుండం హైదరాబాద్ హైవే సిద్దిపేట త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ సమీపంలో ఆవిష్కృతమైంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సిద్దిపేట

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

భారత్ వరల్డ్ రికార్డ్ సొంతం

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): స్వాతంత్య్ర దినోత్సవంలో భాగంగా సిద్దిపేటకు చెందిన భవాని క్లాసికల్ డ్యాన్స్ అకాడమీకి చెందిన కళాకారులు నృత్యప్రదర్శన చేశారు. శనివారం సిద్దిపేటలోని విపంచి కళానిలయంలో పేరణి, భరత నాట్యం, కూచిపూడి తదితర 12అంశాలపై 200 మంది కళాకారులు మొత్తం 76 నిమిషాల పాటు నృత్య ప్రదర్శనలు చేసి భారత్ వరల్డ్ రికార్డును సొంతం చేసుకున్నారు. చిన్నారులు చేసిన నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం భారత్ వరల్డ్ రికార్డును కో–ఆర్డినేటర్ జ్యోతి అందించారు.



నృత్యం చేస్తున్న కళాకారులు

మాస్టర్ ప్లాన్‌పై నిర్లక్ష్యం ఎందుకు?

అసెంబ్లీలో ఎమ్మెల్యే రఘునందన్‌రావు

దుబ్బాకటౌన్ : సీఎం కేసీఆర్ పుట్టి పెరిగి..విద్యాబుద్ధులు నేర్చిన దుబ్బాక మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని శనివారం అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. దుబ్బాకకు ఔటర్ రింగు ఏర్పాటు కోసం సర్వే చేసినప్పటికీ మాస్టర్ ప్లాన్ పెండింగ్‌లో ఉండడంతో ఓఆర్‌ఆర్‌కు ఇంత వరకు ఆమోదం లేదన్నారు. అలాగే ఇతర మున్సిపాలిటీల్లో వెజ్, నాన్ వెజ్ మార్కెట్లు నిర్మాణం పూర్తి కాగా, దుబ్బాకలో మాత్రం ఏర్పాటు చేయలేదన్నారు. దీనిపై మున్సిపల్ మంత్రి స్పందించాలని కోరారు. అలాగే దుబ్బాక అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలన్నారు.



స్నేహం ఎంతో మధురమైనది. కష్టకాలంలో నేనున్నానంటూ భుజం తట్టే ఆత్మీయ స్పర్శ స్నేహం. అమ్మానాన్నల తర్వాత దేవుడిచ్చిన గొప్ప బహుమతి. బంధుత్వాల కన్నా బలమైన బంధం.. ప్రపంచం నీకు దూరమైనప్పుడు దగ్గరయ్యే వాడే నిజమైన స్నేహితుడు. మంచి స్నేహం ఆదర్శమైన జీవితాన్ని ఇస్తుంది. మానవ సంబంధాలు ఆర్థిక బంధాలుగా మారిపోయి మనిషన్నవాడు మాయమైపోతున్న తరుణంలో ఆత్మీయ స్నేహాలు వెలుగు రేఖలుగా దారి చూపుతూనే ఉంటాయి. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనాలు..



నేడు స్నేహితుల దినోత్సవం

కొత్త ఉద్యోగం.. కొత్త స్నేహితులు



సాక్షి, సిద్దిపేట: సిద్దిపేట ఐటీ టవర్ వివిధ ప్రాంతాలకు చెందిన వారిని ఒక చెట్టు కిందికి తీసుకువచ్చింది. ఇందులో సుమారు 12 సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఇప్పటికే ఉద్యోగుల ఎంపిక పూర్తి చేసి శిక్షణ ఇస్తోంది. పలువురు ఐటీ ఉద్యోగులను భోజన విరామ సమయంలో కొత్త ఉద్యోగం.. కొత్త స్నేహితులు అనే అంశంపై 'సాక్షి' పలకరించగా వారి అభిప్రాయాలను పంచుకున్నారు.

ఎవరికీ ఎవరం తెలియదు

ఉద్యోగంలో జాయిన్ అయినప్పుడు ఎవరి ఎవరం తెలియదు. జాయిన్ అయిన రోజు సార్ వాళ్లు పరిచయం చేయించారు. ఈనెల రోజుల్లోనే మా కంపెనీల ఎంప్లాయిస్ అందరం క్లోజ్ ఫ్రెండ్స్ అయ్యాం. తొలుత కొంచెం భయం ఉండేది.. ఇప్పుడు అందరం ఒక ఫ్యామిలీ లాగా ఉంటున్నాం. – వైష్ణవి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

హ్యాపీగా ఉంది



నేను మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ పూర్తి చేశాను. వెంటనే అవకాశం రావడం సంతోషంగా ఉంది. మా కంపెనీలో తక్కువ మంది ఉండడంతో చాలా క్లోజ్ అయ్యారు. నేను రూంలో ఉంటున్నా వారే నన్ను ప్రతి రోజు పికప్ డ్రాప్ చేస్తున్నారు. నాకు ఐటీ టవర్‌లో చాలా మంది కొత్త ఫ్రెండ్స్ అయ్యారు. వారితో చాలా హ్యాపీగా ఉంటూ ట్రైనింగ్ తీసుకుంటున్నా. – వంశీ, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

మొక్కలు నాటుతాం



మా ఇద్దరిది ఒకే స్కూల్. వేరు వేరు కళాశాలల్లో చదివాం. ఐటీ టవర్ వల్ల సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు ఒకే కంపెనీలో పని చేస్తున్నాం. అలాగే మా కంపెనీలో పనిచేస్తున్న అందరిని పరిచయం చేసుకుని కొత్త దోస్తులం అయ్యాం. ఒకరికొకరం హెల్ప్ చేసుకుంటున్నాం. సిద్దిపేట అంటే హరిత సిద్దిపేట. అందుకే మా స్నేహితులందరం కలిసి మొక్కలు నాటేందుకు కృషి చేస్తాం. – స్వాతి, గీత, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు



మాది 23 ఏళ్ల దోస్తాన..



మాది సిద్దిపేటలోని గోనెపల్లి గ్రామం. ముగ్గురం ఒకే స్కూల్, ఒకే కాలేజీ. మా ఇద్దరికీ ఒకే కంపెనీలో జాబ్ వచ్చింది. ఇంకో ఫ్రెండ్ రాహుల్‌కు రాలేదు. వాడికి కూడా మా కంపెనీలో జాబ్ రావాలని కోరుకుంటున్నాం. మాది 23 ఏళ్ల దోస్తాన్. ఐటీ టవర్‌లో కొత్త దోస్తులం చాలా మంది అయ్యాం. – అరవింద్, నిఖిల్, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు

నా అప్లికేషన్ నింపింది నర్సింహులే..



మెదక్: కుటుంబ సభ్యులతో పంచుకోలేని ఎన్నో సంఘటనలు స్నేహితుడితో పంచుకుంటామని మెదక్ అడిషనల్ ఎస్పీ మహేందర్ అభిప్రాయపడ్డారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆయనను పలకరించగా.. తన అనుభవాలను పంచుకున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం ఇటిక్యాలపాడు గ్రామం మా సొంత ఊరు. విద్యాభ్యాసం గద్వాలలో జరిగింది. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకు ప్రభుత్వ కళాశాల కాగా, డిగ్రీ ఓయూలో పూర్తి చేశాను. బాల్య మిత్రుడు నర్సింహులు 8వ తరగతి నుంచి డిగ్రీ వరకు తన క్లాస్‌మేట్. ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్‌లలో నర్సింహులుతో కలిసి పాల్గొన్నా. డిగ్రీ పూర్తయ్యాక ఉద్యోగం కోసం దరఖాస్తు చేసే సమయంలో నా అప్లికేషన్ కూడా అతడే నింపా డు. నర్సింహులుకు పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేయాలని ఆసక్తి ఉండేది. కాని రెండుసార్లు ప్రయత్నం చేసినప్పటికీ ఉద్యోగం సాధించలేకపోయాడు. ప్రస్తుతం రైల్వేలో ఉద్యోగం చేస్తున్నాడు. 1989లో నేను ఎస్ఐగా సెలక్షన్ అయ్యాను. ఇప్పటివరకు కరీంనగర్, వరంగల్, సిద్దిపేట, ఖమ్మం జిల్లాల్లో సర్వీస్ కొనసాగింది. ప్రస్తుతం మెదక్ జిల్లాకు అదనపు (అడ్మిన్) ఎస్పీగా వచ్చాను. ఇప్పటివరకు తన సర్వీస్‌లో 100 అవార్డులు వచ్చాయి. అలాగే ప్రస్తుతం మెదక్ డిగ్రీ కళాశాలలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న వెంకటేశ్వర్లు నాతో ఓయూలో చదివాడు.. ఆయన కూడా నాకు మంచి మిత్రుడు. నేను మెదక్‌కు వచ్చాక.. ఏరా మిత్రమా! ఎలా ఉన్నావని పలకరించి గత స్మృతులను పంచుకున్నాం.

మిత్ర బృందం.. ఆపన్నహస్తం



గజ్వేల్‌రూరల్: ఒకే ఊరివారు కాదు.. ఒకే చోట చదువుకోలేదు. జీవనోపాధిలో భాగంగా ఒకే ప్రాంతంలో వివిధ రంగాల్లో కొనసాగుతున్నారు. గజ్వేల్ మండలం దిలాల్‌పూర్‌కు చెందిన పాశికంటి బాల్‌చంద్రం గజ్వేల్ పట్టణంలోని ఇందిరాపార్కు చౌరస్తా వద్ద వాచ్ రిపేరింగ్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. అక్కారం గ్రామానికి చెందిన కటుకం శ్రీనివాస్ ల్యాబ్ టెక్నీషియన్‌గా ఇదే ప్రాంతంలో ఓ ప్రైవేట్ ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. వీరితో పాటు గుండన్నపల్లికి చెందిన కొల్లూరి శ్రీనివాస్, గజ్వేల్‌కు చెందిన ఎగ్గిడి రాజు, కొలిచెలిమె స్వామి (కూరగాయల వ్యాపారం) చేస్తున్నారు. వేర్వేరు వృత్తుల్లో ఉన్న ఈ ఐదుగురు 2009 నుంచి నిత్యం పేపర్లలో వచ్చే కథనాలను చదువుతూ చలించిపోయేవారు. వీరితో పాటు మరో 10 మంది కలిసి ×ఆపన్నహస్త మిత్ర బృందం₹గా ఏర్పడ్డారు. బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందించి అండగా నిలుస్తున్నారు. వీరి సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేందుకు వివిధ రంగాలకు చెందిన సుమారు 150 మంది వరకు సభ్యులుగా చేరారు. వీరంతా ప్రతి నెల 5వ తేదీలోగా ఓ సమావేశం ఏర్పాటు చేసుకొని సేవా కార్యక్రమం కోసం ఒక్కో సభ్యుడు రూ. 200 జమచేస్తారు. ప్రతి నెల ఒక కార్యక్రమం చొప్పున ఇప్పటివరకు 80 సేవా కార్యక్రమాలు చేపడుతూ.. మనసున్న మారాజులుగా నిలుస్తున్నారు.

బాసటగా 'బడి సోపతులు'



హుస్నాబాద్: పట్టణంలో 1983– 84 పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ×బడి సోపతులు₹ పేరిట స్నేహితుల కుటుంబాల కష్ట నష్టాల్లో పాలు పంచుకుంటున్నారు. అలాగే పలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. పూర్వ విద్యార్థి, ప్రస్తుత పెద్దపల్లి అదనపు కలెక్టర్ గాజుల శ్యాంప్రసాద్ లాల్, కొత్తపల్లి అశోక్ సారథ్యంలో వీరి స్నేహం ధృడంగా కొనసాగుతుంది. ప్రతి సంవత్సరం గెట్ టు గెదర్ పేరిట కార్యక్ర మం నిర్వహిస్తూ స్నేహితుల యోగ క్షేమాలు తెలుసుకుంటూ ఆపదలో ఉ న్న వారిని ఆదుకుంటూ స్నేహ హస్తం అందిస్తున్నారు. వాట్సా ప్ గ్రూప్ ద్వారానే అవసరమైన నిధిని సేకరిస్తూ స్నేహితుల కుటుంబాలకు అండగా నిలుస్తున్నారు.

ఏ కష్టమొచ్చినా ముందుంటాం



ఆపదలో ఉన్న వారిని ఆదుకున్నవాడే నిజమైన స్నేహితుడు. స్నేహితులకు ఏ కష్టమొచ్చిన మేమున్నామని బడి సోపతుల పూర్వ విద్యార్థులు కుటుంబ సభ్యులుగా ఆదుకుంటున్నాం. పూర్వ విద్యార్థి.. ప్రస్తుత పెద్దపెల్లి అదనపు కలెక్టర్ గాజుల శ్యాంప్రసాద్‌లాల్ సారథ్యంలో 2013 నుంచి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. స్నేహితుల ఆడపిల్లల పెళ్లిళ్లకు సాధ్యమైనంత వరకు ఆర్థిక సాయం చేస్తున్నాం. – కొత్తపల్లి అశోక్, బడి సోపతుల నిర్వాహకుడు

స్నేహం.. కష్టాల్లో కలకాలం




వర్గల్(గజ్వేల్): సరిగ్గా ఇరవై ఏళ్ల క్రితం వారందరూ వర్గల్ జెడ్పీ హైస్కూల్‌లో టెన్త్ క్లాస్ విద్యార్థులు. అప్పట్లో 101 మంది విద్యార్థులతో వారిది జంబో బ్యాచ్. ప్రస్తుతం వారందరూ వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. వర్గల్ ఉపసర్పంచ్ పసుల రమేష్, శాకారం ఉపసర్పంచ్ భాస్కర్‌గౌడ్ తదితర 55 మంది విద్యార్థులు సమూహంగా ×క్లాస్‌మెట్స్ 2003–04₹ అని వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. తమ బ్యాచ్‌లో ఎవరికి కష్టం వచ్చినా అండగా ఉంటున్నారు. అయిదు సంవత్సరాల క్రితం తమ బ్యాచ్‌మేట్ శాగంటి దుర్గాప్రసాద్ ప్రమాదానికి గురై మృతి చెందగా అతని కుటుంబానికి రూ. 26 వేల ఆర్థికసాయం చేశారు. కొద్ది నెలల క్రితం బ్రహ్మాచారి మృతిచెందగా భార్య, ముగ్గురు పిల్లలతో కూడిన అతని కుటుంబం కష్టాల్లో కూరుకుపోయింది. వెంటనే స్పందించి వారి కుటుంబానికి రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు.

నీకేం కాదు.. మేమున్నాం



మునిపల్లి(అందోల్): స్నేహితులతో కలిసి ఆదివారం ఇంటిపైన ఆడుకుంటుండగా 2019లో విద్యుత్ తీగలు తాకి మండలంలోని కంకోల్ గ్రామానికి చెందిన మధుకుమార్ రెండు చేతులు కోల్పోయాడు. ఐదో తరగతి స్నేహితులు అందరూ కలిసి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మధుకుమార్‌ను కలిశారు. నీకు ఎం కాదు మేము నీకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. నిరుపేద కుటుంబం కావడంతో దాతలు, వివిధ స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి మధుకుమార్‌ను ఆదుకున్నాయి. రెండు చేతులు కొల్పోయిన మధుకుమార్ నోటితో బొమ్మలు గీయడం నేర్చుకున్నాడు. అతడి ప్రతిభ చూసిన కలెక్టర్ వెంకటేశం మధు కుమార్‌ను అభినందించారు.



రక్తసిక్తమైన రహదారులు

- వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురి దుర్మరణం

కుక్కను తప్పించబోయి..



వడ్ల రాజు (ఫైల్)

కొడిపల్లి(నర్సాపూర్): కుక్క అడ్డురావడంతో తప్పించే ప్రయత్నంలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న సైడ్ రేలింగ్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఒకరు మృతిచెందగా.. మరొకరి పరిస్థితి విషమంగా మారింది. ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి కథనం ప్రకారం.. కామారెడ్డి జిల్లా రాజంపేట మండలం ఆరుగొండ గ్రామానికి చెందిన వడ్ల రాజు (32) హైదరాబాద్‌లోని ఓ కంపెనీలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం అతడి చెల్లెలి వద్దకు బావమరిది రామస్వామితో కలిసి బొంతపల్లికి వచ్చాడు. రాత్రి అక్కడే ఉండి, శనివారం ఉదయం శెట్టిపల్లి సంగారెడ్డికి చెందిన రామస్వామి, తమ్ముడు సతీష్‌తో కలిసి వీరభద్ర స్వామి ఆలయంలో దైవదర్శనం చేసుకున్నారు. అనంతరం రాజు, సతీష్ ఇద్దరు కలిసి అక్కడి నుంచి బైక్‌పై ఇంటికి వెళ్తుండగా.. కొడిపల్లి బట్టమ్మదేవి ఆలయం వద్ద కుక్క అడ్డురావడంతో తప్పించే క్రమంలో బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న సైడ్ రేలింగ్‌కు ఢీకొంది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే అక్కడికి చేరుకున్న ఎస్ఐ శివప్రసాద్‌రెడ్డి 108 అందుబాటులో లేకపోవడంతో ఆటోలో నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే రాజు మృతి చెందినట్టు నిర్ధారించారు. సతీష్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స నిమిత్తం సూరారం మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించారు. మృతుడి చెల్లెలు మమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు. రాజు తండ్రి అనారోగ్యంతో మంచానికే పరిమితం కాగా భార్య నిండు గర్భిణి.

మాసాయిపేట శివారులో..



ప్రభాకర్ (ఫైల్)

చేగుంట(తూప్రాన్): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రమైన మాసాయిపేట శివారులో జరిగింది. ఎస్ఐ హరీష్ కథనం ప్రకారం.. మండలంలోని చెట్లతిమ్మాయిపల్లికి చెందిన చిన్నోళ్ల ప్రభాకర్ (40) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున తూప్రాన్ వైపు నుంచి డానియల్‌తో కలిసి ఆటోలో గ్రామానికి వస్తుండగా.. చౌరస్తా వద్ద నిజామాబాద్ వైపు నుంచి వేగంగా వస్తున్న గుర్తుతెలియని వాహనం ఆటోను ఢీకొట్టింది. ప్రభాకర్ ఘటనాస్థలిలోనే మృతి చెందగా.. డానియల్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. డానియల్‌ను మెరుగైన వైద్యంకోసం గాంధీ ఆస్పత్రికి పంపినట్టు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు దాటుతుండగా..



ఐలయ్య (ఫైల్)

మనోహరాబాద్(తూప్రాన్): పొలానికి వెళ్లడానికి జాతీయ రహదారి దాటుతున్న రైతును గుర్తుతెలియని వాహనం ఢీకొట్టగా అక్కడిక్కడే మృతిచెందిన సంఘటన మనోహరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం చోటు జరిగింది. మండల కేంద్రానికి చెందిన రైతు కేశబోయిన ఐలయ్య (55) తన పొలం వద్దకు వెళుతున్న క్రమంలో 44వ జాతీయ రహదారిపై రోడ్డు దాటుతున్న క్రమంలో నిజామాబాద్ వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈఘటనలో రైతు అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి కుమారుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. మృతుడికి భార్య అమృత, ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుర్లు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

కొండాపూర్(సంగారెడ్డి): గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు మృతి చెందగా, మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. కొండాపూర్ ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. జహీరాబాద్‌కు చెందిన ఇంద్రకుమార్(24) సంగారెడ్డి మండలం సదాశివనగర్‌కు చెందిన కొత్తగడి ప్రవీణ్ ఇద్దరూ స్నేహితులు. వీరు రాత్రి జహీరాబాద్ నుంచి సంగారెడ్డికి వెళ్తున్న క్రమంలో శుక్రవారం రాత్రి సంయుక్త ఇంటర్నేషనల్ స్కూల్ సమీపంలోని జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈప్రమాదంలో ఇంద్ర కుమార్‌కు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా.. ప్రవీణ్ తీవ్రంగా గాయపడ్డాడు.

ప్రమాదవశాత్తు జారి పడి వ్యక్తి మృతి



సత్యస్వరూప్(ఫైల్)

పటాన్‌చెరుటౌన్: ప్రమాదవశాత్తు ఇంట్లో జారి పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం.. ఏపీలోని నెల్లూరుకు చెందిన సత్యస్వరూప్ (33) ఏడేళ్ల క్రితం బతుకుదెరువు నిమిత్తం అమీన్‌పూర్ పరిధిలోని జనమైల్ వ్యాలీలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. డాక్యుమెంటరీ ఫిలిం మేకర్‌గా పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో తండ్రి పాకాల శ్రీకాంత్‌తో చివరిగా జూలై 31 తేదీన ఫోన్‌లో మాట్లాడాడు. తిరిగి కుటుంబ సభ్యులు పలుమార్లు ఫోన్‌చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో తండ్రి తన కుమారుడి స్నేహితుడైన సాయిరెడ్డికి ఫోన్ చేసి ఆరా తీశారు. దీంతో శుక్రవారం ఇంటికి వెళ్లి చూడగా లోపల గడియపెట్టి ఉంది. తలుపులు ఎంత కొట్టిన తీయకపోవడంతో పాటు ఇంటిలో నుంచి దుర్వాసన రావడంతో స్థానికుల సహకారంతో కిటికీ పగలగొట్టి చూశాడు. సత్యస్వరూప్ నేలపై పడి మృతిచెంది కుళ్లిన స్థితిలో కనిపించాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు శనివారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరు.. మనస్తాపంతో మరొకరు..



సందీప్ (ఫైల్)

మద్దూరు(హుస్నాబాద్): మండలంలోని నర్సాయపల్లిలో ఆర్ఎంపీగా పనిచేస్తున్న బోతం సందీప్ (49) ఆర్థిక ఇబ్బందులతో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏఎస్ఐ జగదీశ్వర్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన సందీప్ ఇంటి నిర్మాణం కోసం అప్పు చేశాడు. దీంతో తీర్చేమార్గం లేక శుక్రవారం సాయంత్రం పురుగు మందు తాగి ఇంటికొచ్చి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం చేర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం సిద్దిపేటకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు.

కొమురవెల్లి(సిద్దిపేట): ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని అయినాపూర్‌లో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుడిక్యాల నర్సింహులు(71) పొన్నాలలోని ఓ దాబాలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడికి భార్య, పిల్లలు లేకపోవడంతో గ్రామంలో ఉన్న ఇంటిని అదే గ్రామానికి చెందిన పొన్నోజు మంజులకు అద్దెకు ఇచ్చాడు. ఇదే అదునుగా భావించిన మంజుల అతడికి రూ. 2 లక్షలు అప్పు ఇచ్చినట్టు కాగితాన్ని సృష్టించి కొంతమంది చేత సాక్షి సంతకాలు పెట్టించి మానసిక ఇబ్బందులకు గురిచేసింది. నర్సింహులుకు ఎవరూ లేకపోవడంతో తన ఇంటిని స్వాధీనం చేసుకోవాలని కుట్ర పన్నింది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు కావడంతో నర్సింహులు ఇళ్లు ఖాళీ చేయాలని మంజులకు సూచించాడు. మనసులో పెట్టుకున్న మంజుల గ్రామానికి చెందిన పుల్లూరి భవిత్ కుమార్, తేజకిషోర్, కాయిత రాజేందర్‌రెడ్డి, భట్టు యాదగిరి, దండు నర్సింహులు, మచ్చెర్ల ముత్యంరెడ్డి, మల్లం యాదయ్యతో కలిసి నర్సింహులు పనిచేస్తున్న చోటుకు వెళ్లి బెదిరించి కాగితం రాయించుకున్నట్టు సమీప బంధువులు తెలిపారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన నర్సింహులు శనివారం ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతిపై స్థానికులు, బంధువులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

కూలి పనులకు వెళ్లి.. విగతజీవిగా మారి

- అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



పొలం గట్టుపై యాదగిరి మృతదేహం

తొగుట(దుబ్బాక): కూలికి వెళ్లిన వ్యక్తి అనుమానాస్పదస్థితిలో మృతిచెందిన సంఘటన మండలంలోని పెద్దమాసాన్‌పల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కాశ యాదగిరి (38) నిరుపేద కుటుంబం. వారికి కూతురు నందిని(14), కుమారుడు (7) ఉన్నారు. కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈక్రమంలో యాదగిరి రోజూ మాదిరిగానే గ్రామానికి చెందిన తాళ్ల పెంటయ్య, అంజయ్యతో కలిసి అదే గ్రామానికి చెందిన దాసరి దుర్గయ్య వ్యవసాయ పొలంలో పనికి వెళ్లాడు. పొలంలోకి వెళ్లిన ముగ్గురు పనుల్లో నిమగ్నం కాగా.. కొంత సమయం తర్వాత యాదగిరి అకస్మాత్తుగా పొలంలో పడిపోయాడు. గమనించిన తోటి కూలీలు బయటకు తీసుకువచ్చి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు అక్కడకు వచ్చి పరిశీలించగా యాదగిరి అప్పటికే మృతిచెందాడు. మృతుడి భార్య మంజుల ఫిర్యాదు మేరకు తొగుట పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

క్లుప్తంగా

అసెంబ్లీలో మల్యాల అభివృద్ధిపై ప్రస్తావన



అసెంబ్లీలో సేంద్రియ ఎరువు తయారీ కేంద్రాన్ని చూపుతున్న కేటీఆర్

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధిలోని మల్యాల గ్రామ తడి, పొడి చెత్త సేకరణతో సాధిస్తున్న ప్రగతిపై అసెంబ్లీలో మంత్రి కేటీఆర్ శనివారం ప్రస్తావించడం సంతోషంగా ఉందని సర్పంచ్ దరిపల్లి వజ్రవ్వ అన్నారు. తడి, పొడి చెత్త సేకరణతో ఎరువు తయారీకి గ్రామస్తులు సహకరిస్తున్నారని తెలిపింది. గ్రామ అభివృద్ధికి మంత్రి హరీశ్‌రావు సహకరిస్తున్నారన్నారు.

అర్హులకు బీసీ బంధు ఇవ్వాలి



బెజ్జంకిలో అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు అర్హులందరికీ ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడు శానగొండ శ్రవణ్ డిమాండ్ చేశారు. శనివారం బెజ్జంకిలోని అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఆర్భాటంగా పథకాలు ప్రవేశపెట్టి అమలు చేయడంలో విఫలమవుతోందన్నారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

బెజ్జంకి(సిద్దిపేట): ఈవీఎంలపై ఓటర్లకు అవగాహన ఉండాలని నాయబ్ తహసీల్దార్ పార్థసారధి పేర్కొన్నారు. మండలంలోని లక్ష్మీపూర్‌లో శనివారం మొబైల్ వాహనం ద్వారా ఓటర్లకు ఈవీఎంల పనితీరును, ఓటువేసే విధానాన్ని వివరించారు. ప్రభుత్వం మొబైల్ వాహనం ద్వారా ఓటర్లను చైతన్యవంతులను చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ శ్రీనివాస్, కార్యదర్శి అనిల్, అంగన్‌వాడీ టీచర్ వెంకటలక్ష్మి, గామస్తులు పాల్గొన్నారు.

హాఫ్ మారథాన్‌లో పాల్గొనాలి

చిన్నకోడూరు(సిద్దిపేట): రంగనాయక సాగర్ రిజర్వాయర్‌పై ఆదివారం నిర్వహించే హాఫ్ మారథాన్ విజయవంతం చేయాలని ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఏఎంసీ చైర్మన్ వనిత రవీందర్ రెడ్డి, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు కాముని ఉమేశ్ చంద్ర, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శ్రీనివాస్ శనివారం పిలుపు ఇచ్చారు. ఆరోగ్య సిద్దిపేట సాధించడమే లక్ష్యంగా మంత్రి హరీశ్‌రావు సహకారంతో చేపట్టిన హాఫ్ మారథాన్ విజయవంతం చేసేందుకు భాస్వాములు కావాలన్నారు.

శ్రీ సంతోషిమాత ఆలయ హుండీ లెక్కింపు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని శ్రీ సంతోషిమాత ఆలయ హుండీలను శ్రీ శరభేశ్వర ఆలయ ఈఓ రవికుమార్, శ్రీ సంతోషిమాత ఆలయ ఈఓ విశ్వనాథశర్మ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం లెక్కించారు. మార్చి 29 నుంచి ఆగస్టు 5 వరకు భక్తులు సమర్పించిన కట్న కానుకలను లెక్కించగా రూ.1,74,501 ఆదాయం వచ్చినట్లు అధికారులు తెలిపారు. శ్రీ సంతోషిమాత ఆలయ చైర్మన్ మాంకాల నవీన్ కుమార్, సభ్యులు చకిలం అమర్, గాదగోని సత్యం గౌడ్, కొమురవెల్లి కల్యాణి, గరిపల్లి సువర్ణ, ఎక్స్అఫిషియో సభ్యులు శాకం మధుసూదన్ శర్మ, ఆలయ పూజారి రామకృష్ణ, ఆలయ సిబ్బంది శంకర్, పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకోండి

చిన్నకోడూరు(సిద్దిపేట): ఏటా వర్షాకాలంలో నీటిలోనే జీవనం సాగిస్తున్నామని, తమకు మరోచోట ఇళ్లు నిర్మించి తమను ఆదుకోవాలని మండల పరిధిలోని చర్లం అకిరెడ్డిపల్లి ఎస్సీ కాలనీ వాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం తహసీల్దార్ జయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. వర్షాకాలం వచ్చిందంటే శనిగరం ప్రాజెక్టు నిండటంతో కాలనీ నీట మునుగుతోందన్నారు. అధికారులు సర్వేచేసి ముంపునకు గురవుతున్న వారిని గుర్తించి వారికి ఇండ్ల స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పర్శ రాములు, గ్రామ ఉప సర్పంచ్ రవీందర్, జిల్లా నాయకులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేత

సిద్దిపేటకమాన్: తెలంగాణ వైద్య ఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్ కింద విధులు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్‌లు డీఎంహెచ్‌ఓ కాశీనాథ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. తమకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగాలను క్రమబద్ధీకరించి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

విలీన బిల్లు జాప్యంపై భగ్గు



దుబ్బాక బస్‌డిపో ఎదుట ఆందోళన చేస్తున్న ఆర్టీసీ కార్మికులు



ప్రజ్ఞాపూర్‌లోని జీపీపీ ఆర్టీసీ డిపోవద్ద ఆందోళన చేస్తున్న ఉద్యోగులతో మాదాసు శ్రీనివాస్



సిద్దిపేట ఆర్టీసీ డిపో ఎదుట..

గజ్వేల్‌రూరల్: కార్మికుల సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ పేర్కొన్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు పంపిన బిల్లును గవర్నర్ పెండింగ్‌లో పెట్టడంపై ఆర్టీసీ ఉద్యోగులు, సిబ్బంది గజ్వేల్ మున్సిపాలిటీ పరిధి ప్రజ్ఞాపూర్‌లోగల జీపీపీ(గజ్వేల్–ప్రజ్ఞాపూర్) ఆర్టీసీ డిపో వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనికి మాదాసు శ్రీనివాస్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికుల సేవలను గుర్తించిన సీఎం కేసీఆర్, ప్రజారవాణా వ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసేందుకు కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు కేబినెట్ ఆమోదం తెలిపిందన్నారు. ఈ బిల్లును గవర్నర్ వెంటనే ఆమోదించాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు తెలిపారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన

సిద్దిపేట కమాన్: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును గవర్నర్ ఆమోదించకపోవడంపై సిబ్బంది నిరసన తెలిపారు. శనివారం సిద్దిపేట ఆర్టీసీ బస్‌డిపో ఎదుట శనివారం ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు బస్సులు నిలిపివేసి ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.

బిల్లుపై సంతకం చేయాలి

దుబ్బాక: ఆర్టీసీ కార్మికుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కేబినెట్ ఆమోదంతో రాష్ట్ర ప్రభుత్వం పంపిన బిల్లుపై గవర్నర్ సంతకం చేయాలని దుబ్బాక బస్‌డిపో టీఎమ్‌యూ నాయకుడు అజీముద్దీన్ డిమాండ్ చేశారు. ఆర్టీసీ రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు శనివారం దుబ్బాక బస్‌డిపో ఎదుట ఆర్టీసీ కార్మికులు ఆందోళన చేపట్టారు. గవర్నర్ సంతకాలు చేయాలని నినాదాలు చేశారు.

శాంతిభద్రతల పరిరక్షణే కర్తవ్యం

గజ్వేల్ ఏసీపీ రమేశ్



గజ్వేల్‌లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఫ్లాగ్‌మార్చ్

గజ్వేల్‌రూరల్: శాంతి భద్రతల పరిరక్షణే తమ కర్తవ్యమని గజ్వేల్ ఏసీపీ రమేశ్ పేర్కొన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనర్ శ్వేత ఆదేశాల మేరకు శనివారం గజ్వేల్‌లోని ప్రధాన వీధుల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో కలిసి పోలీసులు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ ఈ ప్రాంత భౌగోళిక పరిస్థితులు తెలుసుకునేందుకు ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించడం జరిగిందన్నారు. ఫ్లాగ్‌మార్చ్‌లో ఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ నరేశ్‌కుమార్, గజ్వేల్ సీఐ జాన్‌రెడ్డి, తొగుట సీఐ కమలాకర్, ఆర్ఏఎఫ్ ఇన్‌స్పెక్టర్లు డీఎస్ మస్కర్, వీపీ రావు, ఆర్ఏఎఫ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అభ్యర్థిగా పరిశీలించండి



నాగపురి కిరణ్‌కుమార్

చేర్యాల(సిద్దిపేట): జనగామ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని మార్చాలని నిర్ణయిస్తే స్థానిక బీసీ నాయకుడనైన తనకు అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు నాగపురి కిరణ్‌కుమార్ సీఎం కేసీఆర్‌కు శనివారం విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్ పిలుపు మేరకు 2014లో తన తండ్రి మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం, తను పార్టీలో చేరామన్నారు. తొమ్మిదేళ్లు గడిచినా ఎటువంటి పదవి ఇవ్వకపోయినా పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని తెలిపారు. రాజలింగం రాజకీయ వారసుడిగా ప్రజలకు అందుబాటులో ఉంటున్నానన్నారు. ప్రజాబలం ఉన్న తనకు జనగామ ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

మత్స్యకారుల వృత్తి నైపుణ్య పరీక్షలు

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని జాలపల్లి గ్రామంలో జిల్లా మత్స్యకార ఏడీ మల్లేశం ఆధ్వర్యంలో మత్యకారులకు వృత్తి నైపుణ్య పరీక్షలు నిర్వహించారు. జాలపల్లి నుంచి 52 మంది, తోర్నాల నుంచి 35 మంది ఈ పరీక్షలో పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందజేత

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలంలోని మంగోల్ గ్రామంలో బీఆర్ఎస్ నాయకుడు తొసుపల్లి కనకయ్య శనివారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సర్పంచ్ పుల్లోజు కిరణ్‌కుమార్‌చారి మృతుడి కుటుంబాన్ని పరామర్శించి రూ. 10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు



రాహుల్ గాంధీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బెజ్జంకి(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్‌గాంధీ అనర్హత వేటుపై స్టే విధించడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం మండలంలోని బేగంపేటలో బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి పోతిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కోర్టు స్టే ఇవ్వడంపై ప్రజాస్వామ్య, న్యాయ వ్యవస్థల విజయంగా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, జనగామ శంకర్, తిరుపతిగౌడ్, శీలం సర్సయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హుస్నాబాద్: అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన స్టే రాహుల్ గాంధీ విజయమని టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి అన్నారు. కోర్టు తీర్పును హర్షిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నించినందుకే రాహుల్‌గాంధీపై బీజేపీ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందన్నారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్, ఎండీ హుస్సేన్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బోనగిరి రజిత పాల్గొన్నారు.

రైతు రుణమాఫీపై హర్షం



కోహెడలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కోహెడ(హుస్నాబాద్): రైతు రుణమాఫీ ప్రకటనపై హర్షం వ్యక్తం చేస్తూ కోహెడ ప్యాక్స్ కార్యాలయం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్యాక్స్ చైర్మన్ దేవేందర్‌రావు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ రైతు సంక్షేమమే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నరన్నారు. కార్యక్రమంలో సీఈఓ మల్లికార్జున్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాల పంపిణీ

కోహెడ(హుస్నాబాద్): కోహెడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చైర్మన్ పెరియాల దేవేందర్‌రావు రైతులకు సబ్సిడీ రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘం పరిధిలోని పాడి రైతులకు ఏంపీఐ డెయిరీ మంజూరు చేసిన రూ.7.80 లక్షలు పంపిణీ చేశామన్నారు. పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తమవంతు కృషి చేస్తున్నమన్నారు. కార్యక్రమంలో పాడిరైతులు సుగుణమ్మ, లక్ష్మయ్య, తిరుపతి, మణెమ్మ, నంది శ్రీనివాస్‌రెడ్డి, మనోహర్, సీఈఓ మల్లికార్జున్‌గౌడ్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

నంగునూరు(సిద్దిపేట): పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను సీఈఐఆర్ యాప్ ద్వారా గుర్తించి శనివారం బాధితుడికు అప్పగించామని రాజగోపాల్‌పేట ఎస్ఐ మోహన్‌రెడ్డి తెలిపారు. మగ్దుంపూర్‌కు చెందిన బట్ట వెంకటయ్య నెల కిందట సిద్దిపేట వెళ్తున్న క్రమంలో సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీఈఐఆర్ ద్వారా గుర్తించి వెంకటయ్యకు అందజేశారు.

మృతుడి కుటుంబానికి సీఎంఆర్ఎఫ్ మంజూరు

దుబ్బాకరూరల్: మండలంలోని పెద్దగుండవెల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్ అనారోగ్యానికి గురయ్యాడు. అయితే చికిత్స కోసం కుటుంబ సభ్యులు సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేశారు. ప్రభుత్వం స్పందించి రూ.60 వేలు చెక్కు రూపంలో మంజూరు చేసింది. కాగా శ్రీనివాస్ చికిత్స పొందుతూ మృతి చెందాడు. చెక్కును మృతుడి కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాజిరెడ్డి, ఉప సర్పంచ్ స్వప్నరవి, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం



గంగాపూర్‌లో గర్భిణులకు సీమంతం చేస్తున్న సూపర్ వైజర్ భాగ్యలక్ష్మి

చిన్నకోడూరు(సిద్దిపేట): తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి అన్నారు. శనివారం మండల పరిధిలోని గంగాపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాలవారోత్సవాలు, సామూహిక సీమంతాలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పుట్టినబిడ్డకు తల్లిపాలు పట్టిస్తే బిడ్డతోపాటు తల్లి కూడా ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఆరునెలల వరకు శిశువుకు తల్లిపాలు పట్టించాలన్నారు. బాలింతలకు పలు సూచనలు, సలహాలిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ లింగారెడ్డి, ఏఎన్ఎం నిర్మల, అంగన్‌వాడీ టీచర్‌లు శారద, తిరుమల, ఆశా వర్కర్‌లు, మహిళలు పాల్గొన్నారు.

చేర్యాల(సిద్దిపేట): తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని శనివారం పట్టణ పరిధిలోని బండపల్లి 5వ అంగన్‌వాడీ కేంద్రంలో బాలింతలకు తల్లి పాల విశిష్టతపై అవగాహన కల్పించారు. వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో మొదట గర్భిణులకు సీమంతం చేసి, అనంతరం బాలింతలకు తల్లిపాల విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ తుమ్మలపల్లి లీల, అంగన్‌వాడీ టీచర్ రమ్య, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

మల్లికార్జున హుండీ ఆదాయం రూ.9.81 లక్షలు

దుబ్బాకటౌన్: దుబ్బాక మున్సిపాల్టీ పరిధిలోని రేకులకుంట మల్లికార్జునస్వామి ఆలయ హుండీని శనివారం లెక్కించారు. ఈఓ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో హుండీ లెక్కించగా రూ.9,81,360 ఆదాయం వచ్చింది. ఆలయ చైర్మన్ రొట్టె రమేష్ పంతులు, దేవదాయ ధర్మదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ రంగారావు, ఆలయ పాలకమండలి, ఒగ్గు పూజారులు, సిబ్బంది పర్యవేక్షించారు.

భవన నిర్మాణంపై భిన్నాభిప్రాయం

మద్దూరు(హుస్నాబాద్): దూల్మిట్ట మండలంలోని హనుమతండాలో నూతన పంచాయతీ నిర్మాణంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. శనివారం సర్పంచ్ జాటోత్ రేణుకకాల్‌రాం, గిరిజ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు దీప్లా నాయక్ తమ అభిప్రాయాలు తెలిపారు.

సెకండ్ ఏఎన్ఎంల ధర్నా

సిద్దిపేటరూరల్: పీహెచ్‌సీలలో పనిచేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసి జిల్లా ప్రధాన కార్యదర్శి కిష్టపురం లక్ష్మణ్ అన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయం ఎదుట సెకండ్ ఏఎన్ఎంలతో కలిసి ధర్నా నిర్వహించారు.

చికిత్స పొందుతూ డిగ్రీ విద్యార్థి మృతి



ముస్త్యాల గౌతమ్ (ఫైల్)

చేర్యాల(సిద్దిపేట): ఆత్మహత్యకు యత్నించిన డిగ్రీ విద్యార్థి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం రాత్రి పట్టణంలోని పెద్దమ్మ గడ్డ అంబేడ్కర్ నగర్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన ముస్త్యాల గౌతమ్(21) డిగ్రీ చదువుతున్నాడు. తండ్రి మధు, నానమ్మ పోశమ్మ 8 నెలల క్రితం అనారోగ్య కారణాలతో మృతిచెందారు. అప్పటి నుంచి చదువుకుంటూ పొలం పనులకు వెళ్తూ తల్లికి అండగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 2వ తేదీన బావి వద్దకు వెళ్లి పురుగుల మందు తాగాడు. ఇంటికి వచ్చి తల్లికి మందు తాగిన విషయంచెప్పాడు. వెంటనే స్థానిక ఆసుపత్రికి తీసుకెళ్లాగా వైద్యులు ప్రథమ చికిత్స చేసి జిల్లా ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. జిల్లా కేంద్రంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స అందిస్తుండగా శుక్రవారం పరిస్థితి విషమించింది. దీంతో హైదరాబాద్ తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతిచెందాడు. తల్లి రాజమణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తెలిపారు.

బస్సు కిందపడిన మహిళకు గాయాలు



గాయపడిన భారతవ్వ

హుస్నాబాద్: ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న క్రమంలో ప్రమాదవశాత్తు బస్సు టైర్ కింద పడి శనివారం ఓ మహిళ తీవ్రంగా గాయపడింది. వరంగల్–1 డిపోకు చెందిన టీఎస్ 03 యూసీ 2889 ఆర్టీసీ బస్సు హుస్నాబాద్ మీదుగా సిద్దిపేటకు వెళ్తోంది. హుస్నాబాద్‌లోని మల్లెచెట్టు చౌరస్తాలో పట్టణానికి చెందిన మర్యాల భారతవ్వ నడుస్తున్న బస్సు ఆపాలని కోరినా బస్సును ఆపకుండా నెమ్మదిగా వెళ్తోంది. బస్సు ఎక్కుతున్న క్రమంలో పట్టు తప్పి వెనుక చక్రం కింద పడంతో పాదం నుజ్జునుజ్జు అ య్యింది. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వైద్యం కోసం ఆటోలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

రెండు బైక్‌లు చోరీ

హుస్నాబాద్: పట్టణంలో శుక్రవారం రాత్రి వేర్వేరు చోట్ల ఏకకాలంలో రెండు బైక్‌లను చోరీ చేశారు. పట్టణంలోని సహస్రా డయాగ్నస్టిక్ సెంటర్ నిర్వాహకుడు ప్రవీణ్ తన షాపు ఎదుట పార్కింగ్ చేసిన బైక్‌ను అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు అపహరించారు. అలాగే పట్టణానికి చెందిన ఠాకూర్ నర్సింగమాన్ తన ఇంటి ముందు పార్కింగ్ చేసిన బైక్‌ను దొంగలించారు. కాగా నర్సింగమాన్‌కు చెందిన బైక్ సెయింట్ జోసఫ్ పాఠశాల సమీప పొదల్లో ఉండటం చూసిన విద్యార్థులు స్థానికుల ద్వారా పోలీస్‌లకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ మహేశ్‌ను వివరణ కోరగా పట్టణంలో రెండు బైక్‌లు అపహరించారని, ఇందులో ఒక బైక్ దొరికిందన్నారు. రెండు బైక్‌లను దొంగలించింది ఒక్కరేనని, త్వరలో దొంగను పట్టుకుంటామని ఎస్ఐ తెలిపారు.

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాల అభివృద్ధి

కోహెడరూరల్(హుస్నాబాద్): కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి చెందాయని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే అలిగిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఆరెపల్లి గ్రామంలో పల్లెపల్లెకు ప్రవీణ్ అన్న..గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ పథకాలను వివరించారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెస్తే గిరిజన తండాల అభివృద్ధికి కృషి చేస్తామని హామి ఇచ్చారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమన్నారు. ఆయన వెంట జిల్లా నాయకుడు బస్వారాజు శంకర్, మండల అధ్యక్షుడు మంద ధర్మయ్య తదితరులు ఉన్నారు.

చోరీ నిందితుల రిమాండ్

రాయపోలు(దుబ్బాక): దౌల్తాబాద్ మండలం తిర్మలాపూర్‌లో దొంగతనానికి పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు దౌల్తాబాద్ ఎస్ఐ చైతన్యకుమార్ తెలిపారు. తిర్మలాపూర్‌కు చెందిన గడ్డం స్వామి శుక్రవారం ఇంటికి తాళం వేసి పొలానికి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం పగులగొట్టి ఉండటం గమనించాడు. ఇంట్లో ఉన్న రూ.1.5 లక్షలు అపహరణకు గురైనట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు అదే గ్రామానికి చెందిన బొట్క మహేశ్, కొమ్ము కనకరాజును అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనానికి పాల్పడినట్లు నిర్ధారణ అయ్యింది. వారి నుంచి సొమ్ము రికవరీ చేసుకుని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

నంగునూరు(సిద్దిపేట): ఎన్నో ఏండ్లుగా అరకొర వేతనంతో పనిచేస్తున్న గోపాలమిత్రల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎండీ ఇమ్రాన్ ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం నంగునూరులో విలేకరులతో మాట్లాడుతూ గోపాలమిత్రలు గ్రామాల్లో తిరుగుతూ పశుపోషణలో అనేక రకాల సేవలందిస్తున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి గోపాలమిత్రలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.

◆ **పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి**

సిద్దిపేటకమాన్: ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సిద్దిపేట మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు అన్నారు. సిద్దిపేట మున్సిపల్ 35వ వార్డులో శనివారం వార్డు కౌన్సిలర్ భూంపల్లి శ్రీలతశ్రీహరి, ప్రజాప్రతినిధులతో కలిసి నడుస్తూ చెత్త తొలగిద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తడి, పొడి, హానికర చెత్తను వేరుచేసి మున్సిపల్ పారిశుధ్య సిబ్బందికి ఇవ్వాలని బహిరంగ ప్రదేశాల్లో వేయకూడదని ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కౌన్సిలర్లు వంగ రేణుక తిరుమల్‌రెడ్డి, బందారం శ్రీలతరాజు, గ్యాదరి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

◆ **చలో అసెంబ్లీ జయప్రదం చేద్దాం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): రాష్ట్రంలో విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తలపెట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని విజయవంతం చెద్దామని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం జరుగుతున్న అసెంబ్లీ సమావేశాల్లో విద్యారంగం సమస్యలపై చర్చించి, పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్, జిల్లా కార్యదర్శి ప్రశాంత్, కొండం సంజీవ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

◆ **విద్యార్థులు సన్మార్గంలో నడుచుకోవాలి**

చేర్యాల(సిద్దిపేట): విద్యార్థి దశ నుండే సన్మార్గంలో నడుచుకుంటూ తల్లిదండ్రుల కలలు నిజం చేయాలని సీఐ పి.సత్యనారాయణరెడ్డి విద్యార్థులకు సూచించారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి–పెద్దరాజుపేట జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో శనివారం పోలీస్ చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రతీ విద్యార్థి బాలలహక్కులపై అవగాహన కలిగిఉండి మంచి నడవడికను అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంఈఓ మొగుళ్ల నర్సింహారెడ్డి, హెచ్ఎం శ్రీనివాస్‌రెడ్డి, సీపీఐ మండల కమిటీ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **మరోసారి మభ్యపెట్టే ప్రకటన**

గజ్వేల్‌రూరల్: మాయమాటలతో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందని బీజేపీ గజ్వేల్ మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో మాట్లాడుతూ రుణమాఫీ చేస్తామంటూ 2014లో బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన హామీ ఇప్పటికీ వరకు నెరవేరలేదన్నారు. అన్నదాతలను మభ్యపెట్టేందుకు మరోసారి రుణమాఫీ చేస్తున్నామని ప్రకటించారని విమర్శించారు. 2018కి ముందు తీసుకున్న రుణాల మొత్తాన్ని మాత్రమే మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుండగా, తీసుకున్న రుణానికి వడ్డీ ఎవరు కట్టాలని ప్రశ్నించారు. రుణమాఫీ జరగకపోవడంతో అప్పులు పుట్టక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ **యువతకు అండగా ఎంపీ ప్రభాకర్‌రెడ్డి**

తొగుట(దుబ్బాక): మెదక్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి యువతకు అండగా నిలుస్తున్నారని పీఏసీఎస్ చైర్మన్ హరికృష్ణారెడ్డి కొనియాడారు. మండలంలోని గుడికందుల, తుక్కాపూర్, ఘనపురం, చందాపురం, జప్తిలింగారెడ్డిపల్లి గ్రామాలకు చెందిన యువకులకు ఉచిత లెర్నింగ్ లైసెన్స్ పత్రాలను శనివారం అందజేశారు. నియోజకవర్గంలో 14 వేల మందికి ఉచితంగా డ్రైవింగ్ లైసెన్స్‌లు ఇప్పిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, సర్పంచ్ నర్సింహులు, యూత్ అధ్యక్షుడు అరుణ్ కుమార్, ఉప సర్పంచ్ సురేశ్, ఏఎంసీ మాజీ చైర్మన్ కనకయ్య, ఆయా గ్రామాల బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

◆ **సమయపాలన పాటించని సిబ్బంది**

హుస్నాబాద్: పట్టణంలోని రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన శిబిరంలో సిబ్బంది సమయపాలన పాటించడం లేదని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ ఆరోపించారు. శనివారం ఓటు హక్కును ఈవీఎం ద్వారా ఎలా వేయాలో తెలుసుకునేందుకు వచ్చిన ఓటర్లు సిబ్బంది లేకపోవడంతో పడిగాపులు కాశారన్నారు. మధ్యాహ్నం 12 గంటలు దాటిన రాలేదన్నారు. సమయపాలన పాటించని సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

◆ **ముదిరాజ్ సంఘం అధ్యక్షుడిగా నారాయణ**

నంగునూరు(సిద్దిపేట): ముదిరాజ్ సంఘం నంగునూరు మండల అధ్యక్షుడిగా తిమ్మాయిపల్లికి చెందిన పిల్లి నారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం నంగునూరులో తెలంగాణ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సమస్యలపై చర్చించారు. అనంతరం సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు తుపాకుల బాలరంగం నారాయణకు నియామక పత్రం అందజేశారు.

కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్యాల కిషన్, చిన్నకోడూర్ అధ్యక్షుడు మేడికాయల వెంకటేశం, సిద్దిపేట రూరల్, అర్బన్ అధ్యక్షుడు నర్సింలు, సిద్దిరాములు, నారాయణరావుపేట అధ్యక్షుడు సంతోష్‌కుమార్, గ్రామ మత్స్యశాఖ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఇంటింటికి మొక్కల పంపిణీ**

హుస్నాబాద్: హరితహారం 9వ విడత కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలోని 15, 16వ వార్డుల్లో మొక్కలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత మాట్లాడుతూ మొక్కల పెంపకంతో పర్యావరణాన్ని కాపాడాలన్నారు. మున్సిపల్ కమిషనర్ రాజశేఖర్, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ జనగామ రత్నమాల, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

◆ **శేషనాగ పడగ బహూకరణ**

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పందిల్ల మహాలింగేశ్వ స్వామి ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శనివారం ఆలయానికి శేషనాగ పడగను పండితులు సూర్యకళ గుండయ శర్మ కుమారులు విష్ణుప్రియ, శ్రీనివాసశర్మ బహూకరించారు. అర్చకుడు నర్సింహమూర్తి పూజచేసి స్వామివారికి అలంకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ తోడేటి రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.